గ్రూప్-4 ఫలితాలు విడుదల

- 96 పోస్టులు భర్తీ చేయకుండా పెండింగ్

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): గ్రూప్-4 ఫలితాలు విడుదలయ్యాయి. మొత్తం 8,084 మంది అభ్యర్థులతో ప్రొవిజినల్ జాబితాను టీజీపీఎస్సీ గురువారం రాత్రి ప్రకటించింది. పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టినట్టు కమిషన్ వెల్లడించింది. అభ్యర్థులు https://www.tspsc.gov.in/ వెబ్‌సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చని తెలిపింది. పరీక్షకు 9,51,321 మంది దరఖాస్తు చేసుకోగా, జూలై 1న పరీక్ష నిర్వహించారు. మొత్తం 8,180 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా.. 8,084 ఉద్యోగాలకు మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేసి మరో 96 పోస్టులను పెండింగ్ పెట్టడం గమనార్హం.

బ్యాక్‌లాగ్ పోస్టులు మిగిల్చితే మెరుపు ధర్నా

- ప్రభుత్వానికి గ్రూప్-4 అభ్యర్థుల హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): గ్రూప్-4లో అన్‌విల్లింగ్ ఆప్షన్ ఇవ్వకుండా ఫలితాలు ప్రకటిస్తే 5,000 మందితో మెరుపు ధర్నా చేస్తామని గ్రూప్-4 అభ్యర్థులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీనిపై గతంలోనే మంత్రులు, ప్రభుత్వ పెద్దలను కలిసి విన్నవించినట్టు గురువారం ప్రకటనలో తెలిపారు. గురుకుల ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు మిగలడంతో 2,000 మందికి అన్యాయం జరిగిందని వాపోయారు. గ్రూప్-4లో అలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని కోరారు.

కుల గణనపై గ్రూప్-3 పరీక్షల ఎఫెక్ట్

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): గ్రూప్-3 పరీక్షల నిర్వహణ కుల గణనపై ప్రభావం చూపింది. పరీక్ష కేంద్రాలుగా కేటాయించిన 87 స్కూళ్లలో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందికి సర్వే విధుల నుంచి మినహాయింపు ఇచ్చారు. 15 నుంచి 18 వరకు ఆయా పాఠశాలల సిబ్బందికి విధుల నుంచి మినహాయింపునిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

డీఎస్సీ అవకతవకలపై విచారణ జరపాలి

- జేఎల్, గ్రూప్-4 నియామకపత్రాలు ఇవ్వాలి
- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తేతెలంగాణ): ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం సమగ్రమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన అభ్యర్థులకు పోస్టింగులు ఇవ్వాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వేసి 11,062 పోస్టులను భర్తీ చేసిందని తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుల ఎంపికలో పారదర్శకత జరిగాయని గుర్తించిన అధికారులు పునఃపరిశీలన చేస్తున్నట్టు పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో కూడా టీచర్ పోస్టులకు ఎంపికైన వారిలో కొందరు బోగస్ అభ్యర్థులు ఉన్నట్టు ఫిర్యాదులు అందాయని అన్నారు. దీంతో అధికారులు స్పోర్ట్స్ కోటాకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు మళ్లీ షెడ్యూల్ జారీ చేశారని తెలిపారు. జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీలో ప్రభుత్వం కొన్ని సబ్జెక్టుల ఫలితాలను విడుదల చేసి మరికొన్నింటి ఫలితాలు విడుదల చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన నియామక పత్రాలు ఇవ్వకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. రాత పరీక్షలు జరిగి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యి పెండింగ్‌లో ఉన్న గ్రూప్ -4, జేఎల్ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బషీరుద్దీన్, తిరుపతి, జావేద్, తిరుపతినాయక్, కార్తీక్, కృష్ణనాయక్, నవీన్, గడ్డం వెంకటేశ్, శివవర్మ, హరికృష్ణ, మహేశ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

సర్వే.. సర్వం తప్పులమయం

- ఇండ్లకు ఇండ్లే మినహాయింపు
- అర్బన్ ఏరియాల్లో మరి అధ్వానం
- అరకొరగానే సమాచార సేకరణ
- పార్ట్-2 ప్రశ్నలకైతే మరీ దారుణం

హైదరాబాద్, నవంబర్14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే క్షేత్రస్థాయిలో తప్పుల తడకగా కొనసాగుతున్నదని సామాజికవేత్తలు తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. ఎన్యూమరేటర్లు అరకొరగా సమాచారాన్ని సేకరిస్తున్నారని మండిపడుతున్నారు. శాస్త్రీయత లేకుండా, పకడ్బందీగా నిర్వహించకపోవడంతో కచ్చితమైన లెక్కలు వచ్చే అవకాశం ఉండబోదని హెచ్చరిస్తున్నారు. వెరసి సర్వే చేసినా పూర్తిగా నిష్ప్రయోజనంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్వే పారదర్శకంగా, పకడ్బందీగా కొనసాగేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇండ్లకు ఇండ్లే మాయం..

సర్వేలో ఇండ్ల స్టిక్కరింగ్ మొదలు, ప్రస్తుతం కొనసాగుతున్న సర్వే తీరు పూర్తిగా తప్పుల తడకగా కొనసాగుతున్నదని సామాజిక వేత్తలు, కులసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సర్వే చేయాల్సిన ఇండ్లను గుర్తించి, స్టిక్కర్లు వేశారు. అయితే ఈ క్రమంలోనే అనేక మంది గృహ యజమానులు విముఖత చూపారు. స్టిక్కరింగ్ చేసేందుకు అంగీకరించలేదు. దీంతో ఎన్యూమరేటర్లు సైతం చేసేదేమీ లేకుండా ఆ ఇండ్లను మినహాయించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఇండ్లను ఇదే రీతిలో మినహాయించారని సామాజికవేత్తలు వెల్లడిస్తున్నారు. ఇదిలా ఉంటే స్టిక్కరింగ్ చేసిన ఇండ్లకు సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా సేకరిస్తున్నారా? అంటే అదీ లేదని కులసంఘాలు ఆరోపిస్తున్నాయి. తొలుత స్టిక్కరింగ్ చేయించుకున్న గృహ యజమానులు సైతం ప్రస్తుతం సర్వేలో తమ వివరాలను వెల్లడించేందుకు విముఖత చూపుతున్నట్టు ఎన్యూమరేటర్లే చెబుతున్నారు. చేసేదేమీలేక ఆ ఇండ్లను సర్వే చేయకుండానే వదిలేస్తూ ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. ఇక పట్టణాల్లోనైతే పరిస్థితి మరీ దారుణంగా ఉన్నదని, స్లమ్ ఏరియాలు మినహా మిగతా ప్రాంతాల్లో సర్వే చేయడం సవాలుగా మారిందని ఎన్యూమరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరకొరగానే సమాచార సేకరణ

ఇంటింటి సర్వేలో కచ్చితమైన లెక్కలు తీయాలంటే ఇప్పటికే అందుబాటులో ఉన్న గణాంకాలతో క్షేత్రస్థాయిలో తులనాత్మక అధ్యాయనం చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో కొత్త కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తే సరిపోయేదని బీసీ మేధావి వర్గం చెబుతున్నది. కానీ, ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నదని వెల్లడించింది. గృహ యజమానులు చెప్పిన సమాచారాన్నే ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్నారని, అది వాస్తవమా? కాదా? అని పరిశీలనకు ఎక్కడా ఆస్కారం లేకుండా పోయిందని వివరిస్తున్నారు. చాలా మంది గృహ యజమానులు ఆస్తులు, ఆదాయ వివరాలను వెల్లడించేందుకు విముఖత చూపుతున్నారని, కుటుంబీకుల వివరాలు, కులం మినహా ఇతర వాటిని చెప్పేందుకు ముందుకురావటం లేదని ఎన్యూమరేటర్లు సైతం తెలుపుతున్నారు. దీంతో అరకొరగానే సమాచార సేకరణ కొనసాగుతున్నట్టు అర్థమవుతున్నది. అదీగాక గృహ యజమానులు ఇచ్చే సమాచారం మీదనే ఆధారపడితే సర్వే ప్రామాణికతనే దెబ్బతింటుందని, ఆయా అంశాలకు సంబంధించిన కచ్చితమైన లెక్కలు వచ్చే అవకాశమే లేకుండా పోతుందని సామాజికవేత్తలు తేల్చిచెబుతున్నారు.

గణాంకాలపై తీవ్ర ప్రభావం..

సర్వేలో కొన్ని ఇండ్లను గణించి, మరికొన్నింటిని వదిలేస్తుండటంతో సమగ్ర సమాచార సేకరణ ఎలా అవుతుందని సామాజిక వేత్తలు, కులసంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. కొంతమంది వివరాలను సేకరించి, మరికొందరిని వదిలేయటంతో సమగ్రత లేకుండా పోతుందని వివరిస్తున్నారు. అరకొరగా సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి రూపొందించే గణాంకాలు కూడా క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రతిబింబించబోవని వెల్లడిస్తున్నారు. సేకరించిన డేటా కచ్చితత్వం, ప్రామాణికతపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. వెరసి మొత్తంగా సర్వే ఉద్దేశం నెరవేరడమే ప్రశ్నార్థకంగా మారుతుందని వివరిస్తున్నారు.

10 మంది వైద్యవిద్యార్థుల సస్పెండ్

- ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ర్యాంగింగ్
- ఫ్రెషర్స్‌ను వేధించిన సీనియర్లపై డైరెక్టర్ చర్యలు

మహబూబ్‌నగర్, నవంబర్ 14: మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యవిద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ చేసినందుకుగానూ 2023 బ్యాచ్‌కు చెందిన 10 మందిని సస్పెండ్ చేశారు. ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని ఎదిర సమీపంలో ఉన్న వైద్య కళాశాల క్యాంపస్‌లో చదువుతున్న 2022-2023 బ్యాచ్‌కు చెందిన రెండో సంవత్సరం విద్యార్థులు.. 2023-2024 ఫ్రెషర్స్‌ను వారంరోజుల కిందట రాత్రి సమయంలో ర్యాగింగ్ చేసినట్టు సమాచారం. ర్యాగింగ్‌తో కొత్తగా చేరిన విద్యార్థులు తీవ్ర మనస్తాపానికి గురైనట్టు కళాశాల డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వివరాలు సేకరించి ర్యాంగింగ్‌కు కారణమైన 10 మందిని సస్పెండ్ చేసినట్టు తెలిసింది. ర్యాగింగ్ పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ తెలిపారు.

హైస్కూళ్లలో లైబ్రరీలు ఏర్పాటుచేయాలి

- తెలంగాణ లైబ్రరీ సైన్స్ స్టూడెంట్స్, నిరుద్యోగుల సంఘం వినతి

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో లైబ్రరీలను ఏర్పాటుచేసి లైబ్రేరియన్లను నియమించాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి తెలంగాణ లైబ్రరీ సైన్స్ స్టూడెంట్స్, నిరుద్యోగుల సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, గురుకుల పాఠశాలలు, వివిధ ప్రభుత్వ కళాశాలలు, ఐటీఐ కళాశాలలు, సాంకేతిక కళాశాలలు, మెడికల్ కళాశాలలు, వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీలుగా ఉన్న లైబ్రేరియన్, వాటి అనుబంధ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఆకునూరి మురళికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఆకుల సాయిలు, గిరి, మంజుల, రాధాకృష్ణ, బాబురామ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

భవిష్యత్తుతరాల కోసం పరిశోధనలు జరగాలి

- కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్
- ఐఐటీహెచ్‌లో కల్పనా చావ్లా వసతి గృహం ప్రారంభం

కంది, నవంబర్ 14: ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా పరిశోధనలు జరగాలని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ పిలుపునిచ్చారు. గురువారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి కల్పనా చావ్లా పేరుతో నిర్మించిన వసతి గృహ భవనాన్ని ఆయన ప్రారంభించారు. క్యాంపస్‌లో మొక్కలు నాటి.. పరిశోధన కేంద్రాలు, తరగతి గదులు, పలు బ్లాక్‌లను పరిశీలించారు.

అటవీ భూముల ఆక్రమణకు 'కడియం' యత్నం

- హనుమకొండ కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలి
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య డిమాండ్

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

ధర్మసాగర్, నవంబర్ 14: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం, దేవునూర్ గ్రామాల శివారులో ఆక్రమణకు గురవుతున్న అటవీ భూములపై కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. గురువారం ధర్మసాగర్ మండలం ముప్పారంలో మాజీ ఎంపీటీసీ మేకల విజయ్‌కుమార్ ఆధ్వరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య భర్త నజీర్, వారి అనుచరులు అటవీ భూములను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. హనుమకొండ జిల్లాలో ఉన్న ఏకైక రిజర్వ్ ఫారెస్ట్ ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో విస్తరించి ఉందని, దీనిని కాపాడుకోవాలని పేర్కొన్నారు. కడియం కుటుంబసభ్యులు తప్పుడు సర్వే నంబర్లతో పట్టా పాసు పుస్తకాలు పొంది ఫారెస్ట్ భూములను కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి కలెక్టర్‌కు లేఖలు పంపించి రెవెన్యూ అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఫారెస్ట్ భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కర్ర సోమిరెడ్డి, నాయకులు లాల్ మహ్మద్, శ్రీనివాస్, వేలేరు మండల బీఆర్ఎస్ నాయకులు ఇట్టబోయిన భూపతిరాజ్, రాజు, తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆయుష్ కోర్సుల్లో దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో అనుబంధ కళాశాలల్లో యూజీ, పీజీ ఆయుష్ కోర్సుల్లో (ఆయుర్వేద, యునాని, హోమియో) యాజమాన్య కోటాలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ తీసుకున్న నిర్ణయం ప్రకారం ఏఐఏపీజీఈటీ-2024, యూజీ నీట్-2024 ఆయుష్ కటాఫ్ స్కోర్‌ను 15 శాతానికి తగ్గిస్తూ ఉత్వర్వులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. తగ్గిన కటాఫ్ స్కోర్ ఆధారంగా అర్హత సాధించిన అభ్యర్థులు పీజీ ఆయుష్ సీట్ల కోసం ఈ నెల 16 నుంచి 19 వరకు, యూజీ ఆయుష్ సీట్లకు ఈ నెల 15 నుంచి 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కన్వీనర్, యాజమాన్య కోటాలకు విడివిడిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారని, వివరాలకు కాళోజీ నారాయణరావు వెబ్‌సైట్‌ను చూడాలని ప్రకటనలో పేర్కొన్నారు.

భుజంగరావు బెయిలు పొడిగింపు

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో మూడో నిందితుడు, మాజీ అదనపు ఎస్పీ ఎన్ భుజంగరావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఈ నెల 18 వరకు మధ్యంతర బెయిలును పొడిగించింది. చికిత్స నిమిత్తం మంజూరైన మధ్యంతర బెయిల్ ఉత్తర్వులు గురువారంతో ముగిశాయి. దానిని పొడిగించాలన్న వినతిని నాంపల్లి కోర్టు తిరస్కరించింది. గురువారం సాయంత్రం 4 గంటల్లోగా కోర్టు ముందు లొంగిపోవాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో భుజంగరావు హైకోర్టులో అత్యవసర లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని ఆమోదిస్తూ జస్టిస్ కే సుజన మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. భుజంగరావు ఆరోగ్యం సరిగాలేదని, ఇటీవల శస్త్రచికిత్సలు చేసుకున్నారని, తిరిగి జైలుకు పంపితే ఆరోగ్యం క్షీణించే ప్రమాదం ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. దీంతో ఈనెల 18వ తేదీ సాయంత్రం 4.30 దాకా భుజంగరావు మధ్యంతర బెయిలును హైకోర్టు పొడిగించింది.

అడ్డుపడితే అణచివేస్తామనడం సరికాదు

- నల్లగొండ, మూసీ బాధితుల మధ్య తగాదా పెట్టొద్దు
- నిర్జీవమైన మూసీకి ఊపిరి పోయాల్సిందే
- రియల్ఎస్టేట్ రంగం చెప్పచేతల్లో ప్రభుత్వం
- 'మూసీ ప్రక్షాళన' సదస్సులో విద్యావేత్తలు, సామాజికవేత్తలు

బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్‌లో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్ట్, మాజీ సంపాదకుడు కే శ్రీనివాస్, ప్రొఫెసర్ జీ హరగోపాల్

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లా రైతులు, హైదరాబాద్‌లోని మూసీ బాధితుల మధ్య తగాదాలు సృష్టించే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని సీనియర్ జర్నలిస్ట్, మాజీ సంపాదకుడు కే శ్రీనివాస్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రాజెక్టులకు అడ్డుపడితే అణచివేస్తామనే ఆవేశపూరిత ప్రకటనలు సరికాదని హితవు చెప్పారు. నిర్జీవమైన మూసీ నదికి పునర్జీవం పోయాల్సిందేనని, అయితే, అన్ని వర్గాలను భాగస్వామ్యం చేస్తూ ప్రణాళికబద్ధంగా ప్రక్షాళన చేయాలని పలువురు వక్తలు సూచించారు. నిర్వాసితులుగా మారుతున్న ప్రజలకు అన్ని పార్టీలు అండగా ఉండాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్‌లో గురువారం సీపీఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'హైడ్రా కార్యకలాపాలు- మూసీ నది ప్రక్షాళన- పేద, మధ్య తరగతి బాధితులకు ప్రత్యామ్నాయం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సభకు సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించగా, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ కే నాగేశ్వర్, సామాజికవేత్త ప్రొఫెసర్ జీ హరగోపాల్, సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణతో పాటు పలువురు మేధావులు ప్రసంగించారు. ఈ సందర్భంగా కే శ్రీనివాస్ మాట్లాడుతూ.. మూసీ నిర్వాసితులకు సముచితమైన పరిహారం, మెరుగైన జీవనోపాధిని కల్పించేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని స్పష్టంచేశారు. మూసీ ప్రక్షాళన అంటే కేవలం ఇండ్లను కూలగొట్టడమే కాదనే విషయాన్ని ప్రభుత్వం గ్రహించాలని సూచించారు. నిర్వాసితుల బాధలు, సమస్యలను ప్రభుత్వం మానవీయ కోణంలో పరిష్కరించాలని కోరారు. సంపూర్ణమైన పరిహారం, జీవనోపాధి అవకాశాలు కల్పించిన తర్వాతే నిర్వాసితులను తరలించాలని సూచించారు. పాలకులు ఎలాంటి ప్రణాళికలు లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు.

అందరినీ ఒప్పించిన తర్వాతే ముందుకెళ్లాలి

మూసీ పరివాహక ప్రాంత ప్రజలను ప్రభుత్వం ఒప్పించి, మెప్పించి, అండగా నిలిచిన తర్వాతే ప్రాజెక్టును చేపట్టాలని ప్రొఫెసర్ కోదండరాం సూచించారు. మూసీనదిపై ఆధారపడిన వారందరికీ మెరుగైన జీవన పరిస్థితులను కల్పించాలని కోరారు.

డీపీఆర్ రూపొందించి చర్చించాలి

ప్రభుత్వం ఏ ప్రాజెక్టు చేపట్టినా డీపీఆర్ ఉండాలని కానీ, అవేవీ లేకుండా ప్రాజెక్టులు చేపట్టడం సరికాదని ప్రొఫెసర్ కే నాగేశ్వర్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... ప్రభు త్వం నమూనా పెట్టుబడి వ్యవస్థల చుట్టూ తిరుగుతున్నదని, ఎప్పుడూ ఆ వ్యవస్థలే ప్రభుత్వాలను ముందుండి నడిపిస్తున్నాయని వివరించారు. రియల్ఎస్టేట్ రంగమే తెలంగాణ ప్రభుత్వాన్ని నడుపుతున్నదని విమర్శించారు. సీపీఐ నేత నారాయణ మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన కోసం 20 ఏండ్లుగా పోరాటం చేస్తున్నామని వివరించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. మూసీ బాధితులకు న్యాయం చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

పరిహారం ఎంతిస్తారు?

తనకు 600 గజాల స్థలం ఉన్నదని, దీనికి ప్రభుత్వం పరిహారం ఏమిస్తుందని బాధితుడు ప్రసాద్ ప్రశ్నించారు. అమీన్‌పూర్‌కు చెందిన హైడ్రా బాధితుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. 40 ఏండ్ల కిత్రం నాటి ఈసీలను పరిశీలించిన తర్వాతే తాను స్థలాన్ని కొనుగోలు చేశానని తెలిపారు. కానీ, అధికారులు వచ్చిన నోటీసులు అంటించిన మరుసటి రోజే తమ ఇంటిని కూల్చివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో తన కుటుంబం మొత్తం రోడ్డు పాలైందని కన్నీరు పెట్టుకున్నారు.

చెరువులకు హద్దు రాళ్లు నిర్ధారించాలి

- జనవరి 30లోగా హెచ్ఎండీఏ పూర్తిచేయాలి
- హెచ్ఎండీఏలోని చెరువుల దీనస్థితిపై హైకోర్టు సీరియస్
- సుమోటోగా స్వీకరించిన ఉన్నత న్యాయస్థానం

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): చెరువుల పరిరక్షణ విషయంలో హైకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. హెచ్ఎండీఏ పరిధిలోని 3వేలకుపైగా ఉన్న చెరువులకు హద్దురాళ్లను నిర్ధారించాల్సిందేనని స్పష్టంచేసింది. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులను పరిరక్షించాలంటూ దాఖలైన పిల్‌ను సుమోటోగా స్వీకరించిన హైకోర్టు.. గురువారం ఆదేశాలు జారీ చేసింది. నిరుడు గచ్చిబౌలిలోని రామమ్మకుంట చెరువు భూముల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలంటూ కొందరు పర్యావరణ, జల వనరుల పరిరక్షణ కమిటీ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే మరోవైపు రామమ్మకుంట చెరువు భూముల్లో ఉన్న ప్రభుత్వ భవనాలను హైడ్రా కూల్చివేసింది. ఈ కూల్చివేతలపై అఫిడవిట్ దాఖలు చేయాలని, అలాగే నగరవ్యాప్తంగా ఉన్న 3వేలకుపైగా చెరువులకు కూడా హద్దులను నిర్ధారణ చేయాలని హెచ్ఎండీఏను ఆదేశించింది. ఇప్పటివరకు పూర్తయిన చెరువుల హద్దుల నిర్ధారణకు సంబంధించిన నివేదికను కూడా పొందుపరుచాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అయితే హెచ్ఎండీఏ ఆ ప్రక్రియను పూర్తి చేయలేకపోయింది. వచ్చే ఏడాది జనవరి 30లోగా అన్ని చెరువులకు బఫర్, ఎఫ్టీఎల్ జోన్ నిర్ధారణతో పాటు ఫైనల్ నోటిఫికేషన్ ఇస్తూ నివేదిక అందజేస్తామని హెచ్ఎండీఏ హైకోర్టుకు తెలిపింది. దీనిపై స్పందించిన హైకోర్టు గడువులోగా నోటిఫికేషన్ పూర్తి చేయాలని పేర్కొన్నది.

సుమోటోగా స్వీకరించిన హైకోర్టు

గచ్చిబౌలిలోని రామమ్మకుంట బఫర్‌జోన్‌లో నిర్మించిన నిథమ్ సంస్థకు చెందిన నిర్మాణాలపై హైకోర్టులో విచారణ జరుగుతుండగా.. అక్కడ హైడ్రా కూల్చివేతలు నిర్వహించింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఒక్క చెరువునే కాకుండా నగరంలో ఉన్న మిగిలిన 3,523 చెరువులకు హద్దులను నిర్ధారించే నోటిఫికేషన్‌ను జారీచేయాలన్న అంశాన్ని సుమోటోగా స్వీకరించింది. హైకోర్టు నిర్ణయంపై పర్యావరణ, సామాజిక కార్యకర్తలు రాజ్‌కుమార్ ఠాకూర్‌సింగ్ హర్షం వ్యక్తంచేశారు. జనవరి 30లోగా హెచ్ఎండీఏ పరిధిలోని అన్ని చెరువులను నోటిఫై చేయాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు.

భూదాన్ భూములను అమ్ముకొని తినేశారు

- ఆరోపణలున్న అధికారులు సమాధానం చెప్పితీరాలి
- మహేశ్వరం భూదాన్ భూముల కేసులో హైకోర్టు

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): భూదాన్ భూముల రక్షణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. పేదల కోసం రామచంద్రారెడ్డి 300 ఎకరాలను ఇవ్వగా అమ్ముకుని తినేశారని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తెలంగాణలో పేదలకు భూములను ఇచ్చిన ఎందరో గొప్పవాళ్లు ఉన్నారని, సీలింగ్ చట్టం అమల్లోకి వచ్చినపుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 500 ఎకరాలు ఇచ్చారని కొనియాడింది. భూదాన్ భూముల రక్షణలో గత బోర్డుతో సహా అధికారులు అందరూ విఫలమయ్యారని వ్యాఖ్యానించింది. భూదాన్ భూములంటూ ఆర్డీవో ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించిన అప్పిలేట్ ట్రిబ్యునల్.. ఆ తరువాత కలెక్టర్ హోదాలో ఆయనే వారసత్వ ధ్రువీకరణ పత్రం జారీచేయడంపై విస్మయం వ్యక్తంచేసింది. నిజాం కూడా భూములను అలా కట్టబెట్టలేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. గత కలెక్టర్ ఇప్పటికే పలు కేసుల విచారణను ఎదుర్కొంటున్నట్టు పత్రికల్లో వార్తలు చదివామని, అధికారులపై ఆరోపణలు ఉన్నపుడు కోర్టుకు సమాధానం చెప్పి తీరాలని స్పష్టంచేసింది. 10 ఎకరాల భూమి భూదాన్ బోర్డుకు చెందినదని ధ్రువీకరించాక వారసత్వ ధ్రువీకరణ పత్రం ఎలా జారీచేస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, భూదాన్ యజ్ఞ బోర్డు, వ్యక్తిగత హోదాలో